రైతులకు అన్యాయం జరిగితే ఊరుకోం

- భూములకు సరైన ధర చెల్లించాలి
- రామాయి సిమెంటు పరిశ్రమ భూముల రైతుల డిమాండ్
- భారీ పోలీసు బందోబస్తు పర్యావరణ అభిప్రాయ సేకరణ

మాట్లాడుతున్న ఆదిలాబాద్ రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలాదేవి

ఆదిలాబాద్, మార్చి 21(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లా రామాయిలో ప్రారంభించనున్న సిమెంటు పరిశ్రమతో భూములు కోల్పోయిన వారికి అన్యాయం జరిగితే ఊరుకునేది లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిశ్రమ ఏర్పాటులో భాగంగా పర్యావరణ అభిప్రాయ సేకరణ నిర్వహించారు. పరిశ్రమను నెలకొల్పడానికి ఆరేండ్ల కిందట 107 ఎకరాల భూమిని కొనుగోలు చేశారని, అనంతరం పనులు ప్రారంభించలేదని స్థానికులు తెలిపారు. ఈ కార్యక్రమానికి రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, పర్యావరణ శాఖ ఇంజినీర్ లక్ష్మణ్‌రావుతో పాటు సాత్నాల మండలంలోని రామాయి, యాపల్‌గూడ, అడ్డగుట్ట, సోనేరావు గూడ గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు. పలువురు రైతుల తమ అభిప్రాయాన్ని తెలియజేశారు. పరిశ్రమ ఏర్పాటులో భాగంగా పలు గ్రామాల రైతులు భూములు కోల్పోతున్నారని, వ్యవసాయం చేసుకుంటూ జీవించే రైతులు ఉపాధి కోల్పోవాల్సి వస్తుందన్నారు. ప్రస్తుతం ఎకరం ధర రూ.30 లక్షల నుంచి రూ.40లక్షల వరకు ఉందని, సరైన ధర చెల్లించాలని రైతులు కోరారు. పరిహారం అందిన తర్వాతనే పనులు ప్రారంభించాలని సూచించారు. పరిశ్రమకు రోడ్డు ఎక్కడి నుంచి ఏర్పాటు చేస్తారో, పరిశ్రమ కాలుష్యం వల్ల వేలాది ఎకరాలకు సాగునీరు అందించే సాత్నాల ప్రాజెక్టు భవిష్యత్ ఏమిటీ? బ్లాస్టింగ్ కారణంగా పరిశ్రమ గ్రామాలవాసుల ఇబ్బందులపై అధికారులు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో ప్రజాభిప్రాయ సేకరణకు భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. అధికారులు మీడియాకు సమాచారం ఇవ్వలేదు.

నిబద్ధతతో విధులు నిర్వహించాలి

- ఆదిలాబాద్ ఒకటవ పట్టణ, మహిళా పోలీస్ స్టేషన్లను సందర్శించిన ఎస్పీ అఖిల్ మహాజన్

మహిళా పోలీస్ స్టేషన్‌లో అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ఎదులాపురం, మార్చి 21: శాంతి భద్రతలను పరిరక్షణకు ప్రతి పోలీసు ప్రధాన లక్ష్యంగా పట్టణంలో మరింత ఉత్సాహంగా పని చేయాలని ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్, మహిళా పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్‌లో ఉన్న వాహనాలపై ఆరా తీశారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులపై చార్జి షీటు దాఖలు చేసి బాధితులకు సత్వర న్యాయం అదే విధంగా కృషి చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ నిబద్ధతతో విధులను నిర్వర్తించాలని సూచించారు. ట్రాఫిక్ సమస్యలపై అధికారులను అడిగి తెలుసుకుని శాశ్వత పరిష్కారానికి కృషి చేయాలన్నారు. మహిళా పోలీసు సిబ్బందితో మాట్లాడుతూ సమస్యలపై వచ్చిన మహిళలకు ప్రత్యేకంగా కౌన్సెలింగ్ ఇస్తూ కుటుంబ సమస్యలను పరిష్కరించాలని లేనిచో చటపరంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకున్న క్షణాల వ్యవధిలో ఘటన స్థలాలకు చేరుకునే విధంగా అప్రమత్తమై ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్ రెడ్డి, పట్టణ సీఐలు సునీల్, శ్రీనివాస్ ఎస్ఐలు అశోక్, పద్మ, ఇసాక్, పీఎస్ఎల్ సిబ్బంది పాల్గొన్నారు.

వేద పాఠశాల విద్యార్థికి తీవ్ర గాయాలు

- అనుమానాస్పద కోణంలో పోలీసుల దర్యాప్తు

బాసర, మార్చి 21: మండలం కేంద్రంలోని వేద పాఠశాలలో శుక్రవారం ఓ విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తుఫ్రాన్‌కు చెందిన ఓ బాలుడు (11) బాసరలోని వేద పాఠశాలలో వేద విద్యనభ్యసిస్తున్నాడు. శుక్రవారం ఉదయం మరుగుదొడ్ల వద్ద బాలుడు తీవ్ర గాయాలపాలై కనిపించాడు. దీంతో పాఠశాల నిర్వాహకులు వెంటనే బాలుడిని చికిత్స కోసం భైంసాలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. బాలుడి తలపై తీవ్ర గాయాలు ఉన్నాయి. గురువారం రాత్రి వేద పాఠశాలలోని సీసీ కెమెరాల కొన్ని గంటల పాటు పని చేయకపోవడం అనుమానాలకు తావిస్తున్నది. బాలుడిపై ఎవరైనా దాడి చేసి ఉండవచ్చని కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. తమ బాలుడిపై హత్యాయత్నానికి పాల్పడిన వారిని వెంటనే పట్టుకొని చర్యలు తీసుకోవాలని బాలుడి తల్లిదండ్రులు, బంధువులు బాసర పోలీస్టేషన్‌కు చేరుకుని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై విచారణ చేస్తున్నామని, అతి త్వరలోనే పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఎస్ఐ గణేశ్ తెలిపారు.

బాసర పోలీస్టేషన్ వద్ద బాలుడి బంధువులు

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

బేల, మార్చి 21: మహిళలు ఆర్థికంగా ఎదగడమే కాకుండా రోజు నిత్య జీవితంలో జరుగుతున్నటువంటి ప్రతి దానిపై అవగాహన కలిగి ఉండాలని ఐకేపీ ఏపీఎం సుజాత అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా బేలలోని పద్మావతి మండల సమైక్య సమావేశ మందిరంలో ఆయా గ్రామాల మహిళా సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలాల్లో జరుగుతున్న ప్రజావాణిలో ప్రతి సభ్యురాలు తమ సమస్యలు తీసుకువచ్చేలా మహిళలకు అవగాహన కల్పించాలని మహిళా సంఘం సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో ఐకేపీ సీసీలు శరత్ రెడ్డి, ప్రమోద్, లక్ష్మి, దేవానంద్, సురేశ్ రెడ్డి పాల్గొన్నారు.

రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి

సారంగాపూర్, మార్చి 21: మండలంలోని జౌళి గ్రామానికి చెందిన మేక భూదేవి ఉపాధి హామీ పనులు చేస్తూ అస్వస్థకు గురై మృతి చెందిన విషయం తెలిసిందే. బాధిత కుటుంబ సభ్యులను శుక్రవారం తెలంగాణ రాష్ట్ర రైతు కూలీ సంఘం సహాయ కార్యదర్శి షేక్ మహిమూద్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూదేవి కుటుంబానికి ప్రభుత్వం రూ. 5లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలన్నారు.

పరీక్ష రాస్తూ సామ్మసిల్లి పడిపోయిన విద్యార్థిని

గుడిహత్నూర్, మార్చి 21 : ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలం తోషం ఆశ్రమ పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో పదో తరగతి పరీక్ష రాయడానికి వచ్చిన ప్రభిక్ష అనే విద్యార్థిని అస్వస్థతకు గురై సోమ్మసిల్లి పడిపోయింది. వెంటనే పరీక్ష నిర్వాహకుడు సంబంధిత అధికారులకు సమాచారం అందజేశాడు. ఆ సమయంలో ఎస్ఐ మహేందర్ అక్కడికి రాగా వెంటనే గుడిహత్నూర్ పీహెచ్‌సీ డాక్టర్‌ను పరీక్ష కేంద్రానికి రప్పించి ప్రథమ చికిత్స అందజేసి పరీక్ష రాయించిన అనంతరం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లి వైద్య చికిత్స ఆ బాలికకు అందజేశారు.

యువకులు క్రీడల్లో రాణించాలి

బోథ్, మార్చి 21: యువకులు క్రీడల్లో రాణించాలని బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి అన్నారు. ఆదిలాబాద్ జిల్లా సొనాలలో నిర్వహిస్తున్న సొనాల ప్రీమియర్ లీగ్ ఫైనల్ మ్యాచ్ సందర్భంగా గెలుపొందిన జట్లకు బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ మల్లేశ్, నిర్వహణ, దాతలు గాజుల పోతన్న, ప్రతాప్, విజయ్, రవీందర్, నాయకులుపాల్గొన్నారు.

రహదారులు ఆక్రమిస్తే కఠిన చర్యలు

నిర్మల్ చైన్‌గేట్, మార్చి,21: రహదారులు ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏఎస్పీ రాజేష్‌మీనా అన్నారు. శుక్రవారం నిర్మల్ బస్టాండ్ సమీపంలో ట్రాఫిక్ నియంత్రణ లో భాగంగా ఆటోడ్రైవర్లు, దుకాణదారులతో ఆయన మాట్లాడారు. రోడ్డుపై పార్కింగ్ చేయడం వల్ల ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఆటో డ్రైవర్లు రోడ్డుపై పార్కింగ్ చేయవద్దన్నారు. రోడ్డు ఆక్రమించి దుకాణాలు పెడితే ట్రాఫిక్ సమస్యలు కలుగుతాయన్నారు. కార్యక్రమంలో సీఐ ప్రవీణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ అరెస్టు చేయడం సిగ్గు చేటు

ఎదులాపురం, మార్చి 21: విద్యారంగానికి 30 శాతం నిధులు అడిగితే అక్రమంగా అరెస్టు చేయడం సిగ్గుచేటు అని ప్రగతి శీల యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆత్రం వినోద్ కుమార్ అన్నారు. విద్యారంగానికి కేవలం 7.57 మాత్రమే నిధులు బడ్జెట్‌లో కేటాయించడాన్ని నిరసిస్తూ అన్ని విద్యార్థి సంఘాల రాష్ట్ర కమిటీ తలపెట్టిన చలో అసెంబ్లీ కార్యక్రమానికి వెళ్లనివ్వకుండా గురువారం రాత్రి వివిధ విద్యార్థి సంఘాల నాయకులను అక్రమంగా అరెస్టు చేసి వివిధ పోలీస్ స్టేషన్‌లకు తరలించారు. అరెస్టు అయిన వారిలో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి ఐక్యత పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సాయికుమార్ ఉన్నారు.

'వన్ నేషన్ వన్ ఎలక్షన్'పై అభిప్రాయ సేకరణ

ఎదులాపురం, మార్చి21: యువత రాజకీయాల్లో రాణించాలనే ఉద్దేశంతో చట్టాలు, ఇతర వాటిపై అవగాహన కల్పించడం జరుగుతుందని ఎన్నేవై అధికారి సుశీల్‌బర్డ్ అన్నారు. ఆదిలాబాద్ శివారులోని నలంద కళాశాలలో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో వన్ నేషన్ వన్ ఎలక్షన్ వికసిత్ భారత్‌పై రెండు రోజుల అభిప్రాయాల సేకరణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఇందులో మూడు జిల్లాల నుంచి విద్యార్థులు పాల్గొని వన్ నేషన్ వన్ ఎలక్షన్ పై ప్రసంగాలు ఇచ్చారు. ఇక్కడ కళాశాల ప్రిన్సిపాల్ పున్నురావ్, వైస్ ప్రిన్సిపాల్ విజయ్ గోపాల్, విశ్రాంత అధ్యాపకుడు విజయ్‌బాబు ఉన్నారు.

హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఫలితాల్లో కొల్వారివాసి

గుడిహత్నూర్, మార్చి 21 : ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలంలోని కొల్వారి గ్రామానికి చెందిన చిట్టి నాందేవ్ ఇటీవల విడుదలైన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఫలితాల్లో 10వ ర్యాంకు సాధించాడు. ఓపెన్ కేటగిరిలో విజయం పొందాడు. గ్రామస్తులు ఆయనకు అభినందనలు తెలిపారు.

నెలాఖరులోపు చెల్లిస్తే 25 శాతం రిబేట్ వర్తింపు

ఎదులాపురం, మార్చి 21: ఎల్ఆర్ఎస్ 2020 స్కీమ్ కింద ప్లాట్ల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారుల కోసం ప్రభుత్వం 25 శాతం రిబెట్‌తో కూడిన చెల్లింపు ద్వారా ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణ ఫీజును మార్చి నెలాఖరులోపు చెల్లిస్తే 25 శాతం రిబేట్ వర్తిస్తుందని ప్రిన్సిపాల్ సెక్రటరీ దాన కిశోర్ అన్నారు. శుక్రవారం గూగుల్ మీట్ ద్వారా ప్రిన్సిపాల్ సెక్రటరీ దాన కిశోర్ అన్ని జిల్లాల కలెక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులకు వివరిస్తూ, రిబేట్ సదుపాయం సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. ఇప్పటి వరకు ఎంతమంది పేమెంట్ చేశారు, తదితర వాటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ రాజర్షి షా అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో మొత్తం మున్సిపల్, పంచాయతీ దరఖాస్తులు 20,381 ఎల్ఆర్ఎస్ దరఖాస్తులలో 1584 పే చేయడం జరిగిందని, ఇందులో 620 మందికి ప్రొసీడింగ్స్ ఇవ్వడం జరిగిందని అన్నారు. మిగతా పెండింగ్ దరఖాస్తులు ఈనెల 31 లోగా పేమెంట్ చేయాలని, గడువులోగా కడితే 25 శాతం రిబేట్ వర్తిస్తుందని, గడువు ముగిసిన తర్వాత వర్తించదని అన్నారు. గూగుల్ మీట్‌లో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ట్రైనీ కలెక్టర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ప్రణాళిక ప్రకారం ముందుకు సాగుతున్నాం

ఎదులాపురం,మార్చి21: సికిల్ సెల్‌ను అంతం చేయడానికి ప్రణాళిక ప్రకారం ముందుకు సాగుతున్నామని ఆదిలాబాద్ డీఎంహెచ్‌వో డాక్టర్ రాథోడ్ నరేందర్ అన్నారు. ఆదిలాబాద్ డీఎంహెచ్‌వో కార్యాలయ సమావేశ మందిరంలో సికిల్ సెల్‌పై జిల్లా స్థాయి టీవోటీ శిక్షణ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సికిల్ సెల్ ఏ విధంగా వ్యాప్తి చెందుతుంది.. దానిని ఎలా కట్టడి చేయాలో ప్రాజెక్టర్ ద్వారా మెడికల్ ఆఫీసర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లో పరిస్థితి దారుణంగా ఉందన్నారు. రక్తహీనత రాకుండా తీసుకోవాల్సిన పోషకాల గురించి వైద్యులకు తెలియజేయడం జరుగుతుందని, వారు క్షేత్రస్థాయిలో వీటిపై అవగాహన కల్పించాలన్నారు. 2047 వరకు రాష్ట్రంలో సికిల్ సెల్ ఎనిమియా లేకుండా చేయడంలో ప్రతి ఒక్కరు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన, ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రీధర్, ఏటీడీవో అనిల్, మెడికల్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

అంబేద్కర్ స్టూడెంట్ యాక్టివిటీస్ సెంటర్ ప్రారంభం

బాసర, మార్చి 21 : బాసర ఆర్జీయూకేటీలో శుక్రవారం అంబేద్కర్ స్టూడెంట్ యాక్టివిటీస్ సెంటర్‌ను ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ పురుషోత్తం, వీసీ గోవర్ధన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమం, పాఠ్యేతర కార్యకలాపాలను ప్రోత్సహించడానికి విశ్వవిద్యాలయం చేస్తున్న ప్రయత్నాల్లో ఈ కార్యక్రమం ఒక మైలురాయి అని తెలిపారు. సామాజిక న్యాయం, సమానత్వం కోసం డా.బీఆర్ అంబేద్కర్ చేసిన కృషికి గుర్తింపుగా ఆర్జీయూకేటీ స్టూడెంట్ యాక్టివిటీస్ సెటర్‌కు ఆయన పేరు పెట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రిపుల్ఐటీ ఓఎస్డీ మురళీ దర్శన్, ఏవో రణధీర్‌సాగి అధికారులున్నారు.

ట్రిపుల్ఐటీలో అంతప్రజ్ఞ టెక్ ఫెస్ట్

బాసర, మార్చి 21 : బాసర ఆర్జీయూకేటీలో శుక్రవారం అంతప్రజ్ఞటెక్ ఫెస్ట్ నిర్వహించినట్లు ట్రిపుల్ ఐటీ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ పురుషోత్తం, వీసీ గోవర్ధన్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉన్నత విద్యామండలి వైస్‌చైర్మన్ పురుషోత్తం మాట్లాడుతూ విద్యార్థులు తమ సృజనాత్మకత, ఆవిష్కరణలు అన్వేషించడానికి అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించడం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. దేశంలోనే అత్యుత్తమ విద్యాసంస్థగా ట్రిపుల్ఐటీని మారుస్తామని విద్యార్థులకు అత్యాధునిక సౌకర్యాలు, రాణించడానికి అవకాశాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఓఎస్‌డీ మురళీధర్శన్, ఏవో రణధీర్‌సాగి, అసోసియేటెడ్ డాక్టర్ విఠల్, డాక్టర్ మహేశ్, డాక్టర్ చంద్రశేఖర్, కన్వీనర్లు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు ప్రత్యామ్నాయ చర్యలు

ఎదులాపురం, మార్చి 21: ఖండాల గ్రామంలో నీటి సమస్య తలెత్తకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటామని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదిలాబాద్ రూరల్ మండలంలోని ఖండాల గ్రామం నుంచి 4 కిలో మీటర్ల దూరంలో వాగు వద్ద బోర్‌వెల్ వేసి అక్కడి నుంచి పైపు లైన్ ద్వారా గ్రామంలోని జీఎల్ఎస్ఆర్ ట్యాంకు ద్వారా ఉదయం 7, సాయంత్రం 6 గంటలకు రోజుకు 10 వేల లీటర్ల నీటిని సరఫరా చేస్తామన్నారు. ముఖ్యంగా ఖండాల గ్రామంలో భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో నీటి సరఫరా నిర్దిష్ట సమయంలో చేయడం జరుగుతుందని, ప్రత్యామ్నాయ దిశగా గ్రామ పంచాయతీ ట్యాంకర్ ద్వారా సరాఫరా చేస్తామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ట్రైనీ కలెక్టర్ అభిగ్యాన్, అధికారులు పాల్గొన్నారు.

ఈ నెల చివరిలోగా పూర్తి చేయాలి...

ఆదిలాబాద్ కలెక్టరేట్‌లో కలెక్టర్ రాజర్షి షా హమాలీల సమస్యలు, లైసెన్స్‌లపై శుక్రవారం సమావేశం నిర్వహించారు. వ్యవసాయ కమిటీలలో హమాలీలకు కొత్తగా లైసెన్సులు ఇచ్చుటకు జిల్లా స్థాయి సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. వ్యవసాయ కమిటీల అధికారులకు హమాలీ లైసెన్స్‌లు జారీ చేయుటకు పేపర్ ప్రకటన ద్వారా దరఖాస్తులు స్వీకరించి ఎంపిక ప్రక్రియను మార్చి చివరిలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కమిటీలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చైర్‌పర్సన్ శ్యామలాదేవి, జిల్లా సహకార అధికారి, జిల్లా మార్కెటింగ్ అధికారి, జిల్లా. మేనేజర్ మర్క్‌ఫెడ్, అసిస్టెంట్ లేబర్ కమిషనర్,గుడిహత్నూర్ పీఏఈఎస్ సీఈవో, సబ్ కలెక్టర్, ఆర్డీవోలు సభ్యులుగా ఉంటారన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ట్రైనీ కలెక్టర్ అభిగ్యాన్ మార్కెట్ కమిటీ చైర్మన్, మార్కెటింగ్, మార్క్‌ఫెడ్, సహకార శాఖ, అధికారులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం

జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్ శ్యామలాదేవితో కలిసి సమావేశం నిర్వహించారు. కలెక్టర్ చైర్మన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ అధికారులందరూ కలిసి ఎంత ఇసుక ఉన్నది స్థానిక అవసరాలకు ఎంత వాడుకోవచ్చు ఆ వివరాలు నివేదిక రూపంలో త్వరగా పంపాలని ఆదేశించారు. ఈ సమావేశానికి ఎస్పీ, ట్రైనీ కలెక్టర్, అదనపు కలెక్టర్, ఏడీమైన్స్, డీడీ గ్రౌండ్ వాటర్ ఇరిగేషన్ పెన్‌గంగా అధికారులు పాల్గొన్నారు. సంబంధిత మండలాల తహసీల్దార్లు జైనథ్, భీంపూర్, బేల, సాత్నాల, భోరజ్ అధికారులను స్థానిక అవసరాలకు గాను తహసీల్దార్లు సంబంధిత మండలంలో ఇసుక బీచ్‌లను గుర్తించి నివేదిక ఇవ్వాలని తెలిపారు. ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు ప్రదానం

భీంపూర్, మార్చి 21 : ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం కామట్‌వాడలో ఆదివాసీ యూత్ క్రికెట్ టోర్నమెంట్‌లో మొదటి బహుమతి రూ.21 వేలు శాంతినగర్ కొలాం ఆదివాసీ జట్టు, రెండో బహుమతి రూ. 10 వేలు మహారాష్ట్ర హీరాపూర్, మూడో బహుమతి రూ.7 వేలు బేల్సరిరాంపూర్ జట్టు కైవసం చేసుకున్నాయి. విజేత జట్లకు శుక్రవారం జడ్పీటీసీల ఫోరం మాజీ జిల్లా అధ్యక్షుడు తాటిపెల్లి రాజు అందజేశారు. కార్యక్రమంలో దాతలు మహాజన్ భీంరావ్, జ్ఞానేశ్వర్, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

చివరి ఆయకట్టు వరకు నీటిని అందించండి

కడెం, మార్చి 21 : సదర్మాట్ చివరి ఆయకట్టు వరకు సాగునీటిని అందించేలా చర్యలు తీసుకోవాలని సదర్మాట్ కాలువ సాధన సమితి అధ్యక్షుడు రాజేందర్ హపావత్ డిమాండ్ చేశారు. శుక్రవారం కడెం ప్రాజెక్టు ఈఈ విఠల్‌కు కడెం మండలంలోని చిట్యాల్ గ్రామ రైతులతో కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం స్పందించిన ఈఈ తక్షణమే సాగునీటిని అందించేలా చర్యలు తీసుకోవాని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇక్కడ రైతులు రమేశ్, నరేందర్‌రెడ్డి, మల్లారెడ్డి, తిరుపతి ఉన్నారు.

కళ్లద్దాలు పంపిణీ

బోథ్, మార్చి 21 : ఆదిలాబాద్ జిల్లా బోథ్, నేరడిగొండ మండలాల్లోని వివిధ పాఠశాలలకు చెందిన 84 మంది విద్యార్థులకు శుక్రవారం ఆర్‌బీఎస్‌కే డాక్టర్ వీణ సాగర్ కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఇది వరకు నిర్వహించిన కంటి వైద్య శిబిరాల్లో గుర్తించిన విద్యార్థులకు వీటిని అందజేశారు. కార్యక్రమంలో ఫార్మాసిస్టు ఓంప్రకాశ్, ఫార్మాసిస్టు సుధాల రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలి

బోథ్, మార్చి 21: భూగర్భ జలాల పెంపు కోసం ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని బోథ్ ఎంపీడీవో రమేశ్ సూచించారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని చింతగూడ, బాబెర, నేరడిపల్లె గ్రామాల్లో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీవో అతుల్ కుమార్, ఏపీవో జగ్దేరావ్, ఏఈవోలు పాల్గొన్నారు.

రుణాలు రెన్యూవల్ చేయించుకోవాలి

బోథ్, మార్చి 21 : బోథ్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో పంట రుణాలు తీసుకున్న రైతులు ఈ నెల 31వ తేదీలోగా వడ్డీ చెల్లించి రెన్యూవల్ చేయించుకోవాలని సీఈవో గోలిస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. దీర్ఘకాలిక రుణాల కిస్తులు సకాలంలో చెల్లించాలని సూచించారు. సహకార బ్యాంకు మేనేజర్ శైలజ ఆధ్వర్యంలో సిబ్బంది గ్రామాల్లో తిరిగి రైతులకు అవగాహన కల్పిస్తున్నారని పేర్కొన్నారు.

నిర్మల్ డిపో మేనేజర్‌గా పండరి

నిర్మల్ అర్బన్, మార్చి 21 : నిర్మల్ డిపో మేనేజర్‌గా పండరి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ డిపో మేనేజర్‌గా విధులు నిర్వహించిన ప్రతిమా రెడ్డి ఆదిలాబాద్ డిపోకు బదిలీ అయ్యారు. పండరి హైదరాబాద్‌లోని మియాపూర్ -2 డిపోలో అసిస్టెంట్ ఇంజినీర్‌గా విధులు నిర్వహిస్తూ ఉద్యోగోన్నతిపై నిర్మల్ డీఎంగా వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన డీఎంను కార్యాలయ ఉద్యోగులు ఘన స్వాగతం పలికి పూలమాల వేసి శాలువాతో సన్మానించారు.

మెరిట్ లిస్టు జాబితా విడుదల

నిర్మల్ చైన్‌గేట్, మార్చి 21 : జాతీయ ఆరోగ్య మిషన్ కార్యక్రమంలో భాగంగా కాంట్రాక్టు పద్ధతిన ఉద్యోగాలకు దరఖాస్తు చేస్తున్న అభ్యర్థుల మెరిట్ జాబితా విడుదల చేసినట్లు నిర్మల్ జిల్లా వైద్యాధికారి రాజేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఇచ్చిన నోటిఫికేషన్ స్టాఫ్‌నర్స్, డీపీవో, ఎంఎల్‌హెచ్‌పీ ఉద్యోగాలకు సంబంధించిన దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల మెరిట్, సెలక్షన్ జాబితా, రిజక్ట్ జాబితాను వెబ్‌సైట్ www.nirmal.telangana.gov.in పోర్టల్ నందు, జిల్లా వైద్యాధికారి కార్యాలయం నోటీస్ బోర్డులో పొందుపరిచినట్లు పేర్కొన్నారు.

ఊరెక్కున్నారా.. జర జాగ్రత్త!

సోన్, మార్చి 21: వేసవికాలం ప్రారంభమైనందున ఊరెళ్లితే పోలీసులు, పక్కింటి వాళ్లకు సమాచారం ఇచ్చి వెళ్లాలని సోన్ ఎస్ఐ కే గోపి అన్నారు. శుక్రవారం నిర్మల్ జిల్లా సోన్‌లోని ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లోకి కొత్తగా ఎవరైనా వస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని, తాళం వేసి ఉన్న ఇంట్లో విలువైన వస్తువులను ఉంచరాదని సూచించారు.

దివ్యాంగులకు యూడీఐడీ కార్డులు అందేలా చర్యలు తీసుకోవాలి

నిర్మల్ చైన్‌గేట్, మార్చి 21 : అర్హులైన దివ్యాంగులకు యూడీఐడీ కార్డులు అందేలా చర్యలు తీసుకోవాలని నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ సమావేశమందిరంలో యూడీఐడీ కార్డుల జారీపై మార్గదర్శకాలు, దివ్యాంగుల సమస్యలు, తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సదరం సర్టిఫికెట్‌కు బదులుగా అర్హులైన దివ్యాంగుడికి యూనిక్ డిసేబిలిటీ ఐడీ నంబర్‌ను కేటాయించాలనే లక్ష్యంతో ప్రభుత్వం మార్చి 1 నుంచి దివ్యాంగులకు పునరావాసం, సాధికారత కోసం డైనమిక్ వెబ్ ఎనేబుల్ సిస్టమ్‌ను రూపొందించిందని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఆర్డీవో విజయలక్ష్మి, దవాఖాన పర్యవేక్షకులు గోపాల్‌సింగ్, దివ్యాంగులు, అధికారులు పాల్గొన్నారు.

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి

లక్ష్మణచాంద, మార్చి 21: మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ రికార్డులు సక్రమంగా నిర్వహించాలని డీఆర్డీవో విజయలక్ష్మి ఆదేశించారు. శుక్రవారం నిర్మల్ జిల్లా లక్ష్మణచాందలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన 15వ సామాజిక తనిఖీ ప్రజావేదికలో ఆమె పాల్గొని మాట్లాడారు. మొదట మండలంలోని